www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 13 ఫిబ్రవరి 2025

5

పశ్చిమ గోదావరి



వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి : కలెక్టర్

భీమవరం : జిల్లాలో వెట్టి చాకిరీని నిర్మూలించడం ద్వారా, ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వెట్టిచాకిరీ నిర్మూలనపై గోడపత్రికను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వెట్టిచాకిరీ కార్మికులను అదుపులో ఉంచే క్రమంలో వారిని భయపెట్టడానికి, బలవంతంగా పనిచేయించడం కోసం భావోద్వేగ, శారీరక హింసను యజమానులు ప్రయోగిస్తుంటారని అటువంటి వారిపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూతో పౌల్ట్రీ పల్టీ..!

పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు

స్తంభించిన ఎగుమతులు

ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఉపాధి సమస్య

అధికారుల ప్రకటనలు సరికాదంటున్న రైతులు



ప్రజాశక్తి - తణుకు రూరల్

బర్డ్‌ఫ్లూ.. పౌల్ట్రీ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసింది. ఇప్పటికే కొన్ని రోజులుగా కోళ్ల మృతి చెందుతుండడంతో పౌల్ట్రీ రైతులు ఆర్థికంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బర్డ్ ఫ్లూ వార్తలు, చికెన్, గుడ్లు వాడకంపై నిషేధం గోరు చుట్టుపై రోకలిపోటులా మారిందని రైతులు లబోదిబోమంటున్నారు. తణుకు పరిసర ప్రాంతాలతోపాటు పశ్చిమగోదావరి, అటు ఏలూరు జిల్లాలో చికెన్, గుడ్ల అమ్మకం గణనీయంగా పడిపోయింది. వాస్తవంగా కృష్ణానంద పౌల్ట్రీ ఫారానికి కిలోమీటర్ వరకూ రెడ్‌జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధి వరకూ సర్వేలెన్స్ జోన్‌గా ప్రకటించారు. ఆ పరిధిలో చికెన్ షాపులు మూసివేయడంతోపాటు గ్రామాల్లో ఆయా పంచాయతీలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాయి. తణుకు నియోజకవర్గంలో తణుకు రూరల్, ఇరగవరం, అత్తిలి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో మొత్తం 50 వరకూ పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఫారంలో సామర్థ్యాన్ని బట్టి పది వేల నుంచి లక్ష వరకూ కోళ్లను పౌల్ట్రీ రైతులు పెంచుతున్నారు. పది వేల సామర్థ్యం కలిగిన కోళ్ల ఫారానికి మేత, మందులు, కూలీల జీతాలు అన్నీ కలిపి రోజుకు రూ.35 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రోజుకు 1.32 టన్నుల మేత ఖర్చవుతుందని, ఒక టన్ను ధర రూ.30 వేల నుంచి రూ.32 వేల ధర పలుకుతోంది. మేత కింద మొక్కజొన్న, నూకలు, సోయా కేకులు, డిఒబి, సన్‌ఫ్లవర్, ఎండు చేప కలిపి కోళ్లకు మేతల కింద ఇస్తారు. ఈ మేతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు శాతం జిఎస్‌టి విధిస్తోంది. మేతలే కాకుండా మొదటి రోజు పిల్ల దశ నుంచి 25 వారాల వరకూ క్రమం తప్పకుండా నిర్ణీత కాలవ్యవధిలో వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది. 22వ వారం నుంచి కోడిగుడ్లు పెట్టడం మొదలవుతుంది. అప్పటి వరకూ ఒక్కో కోడిపై రూ.360 ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఒక్క గుడ్డు ఉత్పత్తికి రైతుకు రూ.4.31 మేత, కోడి నిర్వహణకు ఖర్చవుతుంది. రోజురోజుకీ పెరుగుతున్న ఖర్చులతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులు ఇప్పటికే లక్షల్లో కోళ్ల మృత్యువాత పడి తల్లడిల్లుతున్నారు. దీనికి కారణం తాజాగా బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో మూడు నెలలు కోళ్ల ఫారాలు మూసివేయాలని ఆ పరిధిలో అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో చికెన్, గుడ్లు వినియోగించరాదనే ప్రచారం పౌల్ట్రీ రైతుల పరిస్థితిని మరింత దిగజార్చింది. పౌల్ట్రీ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక్కో పౌల్ట్రీ ఫారంలో రెండు నుంచి నాలుగు కుటుంబాల వరకూ వలస కూలీల కుటుంబాలు జీవనం సాగిస్తుంటాయి. ఇక తణుకు పరిసరాల్లో 11 వరకూ ఎగ్ ట్రేడింగ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా పౌల్ట్రీ ఫారాల్లో సేకరించిన గుడ్లను పశ్చిమబెంగాల్, అస్సాం, ఒడిశ్శా, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు ఇక్కడ నుంచే ఎగమతి చేసుకుంటున్నాయి. ఒక్కో లారీలో 1.50 లక్షల గుడ్లు చొప్పున 20 లారీల లోడులు ఇతర రాష్ట్రాలకు ప్రతిరోజూ ఎగుమతి అవుతున్నాయి. ఇలా గుడ్లు సేకరించేందుకు వెళ్లే ఒక్కో లారీపై ఆరుగురు కూలీల చొప్పున పని చేస్తుంటారు. ప్రస్తుతం తలెత్తిన పరిస్థితుల్లో పౌల్ట్రీ పరిశ్రమ ఉత్పత్తి నిలిచిపోయి నష్టాల్లోకి వెళ్తే లక్షలాది మంది కూలీలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.

అధికారుల ప్రకటనపై పౌల్ట్రీ రైతుల అసంతృప్తి

బర్డ్ ఫ్లూ, ఆపై చికెన్, గుడ్లు వాడకంపై అధికారులు చేసిన ప్రకటనపై పౌల్ట్రీ రైతుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఈ బర్డ్ అనేది ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ ప్రభావం పక్షులపై, కోళ్లపై తీవ్రంగా ఉంటుందని, కోళ్ల ఫారాల్లో పనిచేసే వ్యక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. మాంసం వినియోగం తగ్గించి, ఉడకబెట్టిన గుడ్లు వినియోగించడంలో ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. ఈ వైరస్ బారిన పడిన మనుషుల్లో జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయని, ఈ వైరస్ ప్రభావం మరింత ఎక్కువ ఉంటే తీవ్రమైన దగ్గు ఆయాసం వస్తుందంటున్నారు. ఈ వైరస్ ప్రభావం తీవ్రమైతే నిమోనియా వంటి లక్షణాలు కన్పిస్తాయని, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ చేరుతుందని చెబుతున్నారు. లక్షణాల తీవ్రతను బట్టి టానిఫ్లూ-75 ఎంజి ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

అపోహల ప్రచారం సరికాదు..



పెన్మెత్స సుబ్బరాజు, పౌల్ట్రీ రైతు, కావలిపురం, ఇరగవరం మండలం

ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్స్ ప్రకారం బర్డ్ ఫ్లూ ఇక్కడ మనుషులకు వ్యాపిస్తుందని అపోహ పడడం సరికాదు. బర్డ్ ఫ్లూ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి తప్ప కోడిమాంసం, గుడ్లు వినియోగించొద్దని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదు. ఈ వైరస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే చనిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మాంసం, గుడ్లను మనం 150 నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించిన తర్వాత తీసుకుంటాం. కాబట్టి వైరస్ ప్రభావం ఉండదు. మైనస్ డిగ్రీల్లో ఉండే దేశాల్లో ఇది మనుషులకు వ్యాపిస్తుంది. ఎపిలో ఉండే ఉష్ణోగ్రతలు కోడి మనుగడకు అనువైనవి. కోడిలో రోగనిరోధక శక్తి పెరిగేందుకు తగిన మందులు ఇవ్వడం ద్వారా వైరస్ ప్రభావం పెద్దగా ఉండదు.

బర్డ్ ఫ్లూ పట్ల ఆందోళన అక్కర్లేదు



కె.శంకరం, పశు సంవర్ధక శాఖాధికారి

బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనకూ గురికావాల్సిన అవసరం లేదు. కోడి గుడ్లు, కోడి మాంసం వినియోగంపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. పూర్తిగా ఉడికించిన ఆహారం తీసుకోవడం వల్ల వైరస్ ప్రభావం ఉండదు. 50 డిగ్రీలు దాటితే వైరస్ చనిపోతుంది. అటువంటిది 100 నుంచి 150 డిగ్రీల వరకూ ఉడికించి తినడం వల్ల ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఇది ఒక ఫారం నుంచి మరో ఫారానికి వ్యాపించి నష్టాలు పెరగకుండా ఉండడం కోసమే నియంత్రణ చర్యలు చేపట్టాం.

చనిపోయిన కోళ్లు ఖననం

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేస్తున్నామని, ప్రజలు వదంతులు నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తణుకు మండలం వేల్పూరులో కోళ్లు మరణిస్తున్నాయని తెలిసిన వెంటనే జిల్లా పశుసంవర్ధక శాఖ ద్వారా చనిపోయిన కోళ్ల నుంచి సేకరించిన నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించడం జరిగిందని, వారు పరిశీలించి ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా వ్యాధి సోకినట్లు నిర్ధారించారని తెలిపారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేయడానికి పశువైద్యులు, సహాయక సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాలకు కిలో మీటరు మేర ఎలర్ట్ జోన్‌గా ప్రకటించి అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై సోమవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పోలీసు, రెవెన్యూ, అటవీ, పశు సంవర్ధక తదితర శాఖలతో 20 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ తక్షణం వ్యాధి నివారణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామాలకు చుట్టుపక్కల 10 కిలో మీటర్ల మేరకు సర్వేలెన్స్ ప్రాంతంగా ప్రకటించి, కోళ్లు, కోళ్ల ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని చెరువులు, కొల్లేరు పరివాహ ప్రాంతంలో వలస పక్షులు వచ్చే ప్రాంతాల్లో ఈ వ్యాధి ప్రబలకుండా రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేసి వ్యాధి పర్యవేక్షణ చేయడం జరుగుతోందని తెలిపారు. ఎలర్ట్ జోన్ ప్రాంతంలో మినహా, మిగిలిన ప్రాంతాల్లో ఉడకబెట్టిన గుడ్లు, మాంసాన్ని నిర్భయంగా వినియోగించుకోవచ్చున్నారు. కోళ్లు, గుడ్లు, కోళ్ల దాణా వ్యాధి సోకిన ప్రదేశానికి, బయటకు రాకుండా నిరోధించడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచామన్నారు. కోళ్ల కార్మికులు, ప్రభావిత ప్రాంతాల నివాసితులను క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసేందుకు జిల్లా వైద్యాధికారికి ఆదేశాలిచ్చామన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఈనెల 13 నాటికి వ్యాధి సోకిన వాటిని తొలగించి ఖననం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

అసంఘటిత రంగ కార్మికులను..

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు పెద్ద ఎత్తున ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు, కార్మిక బోర్డు సభ్యత్వం నమోదు, భవన నిర్మాణాలపై ఒక శాతం సెస్ వివరాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై గూగుల్ మీట్ ద్వారా కార్మిక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఒలతో సమీక్షించి మాట్లాడారు. అపత్కాల సమయంలో వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల ఇబ్బందులు, కష్టాలను పరిగణలోకి అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 4.5 లక్షల మంది కార్మికులు నమోదు చేసుకున్నారని, మార్చి 31 నాటికి మరో ఐదు లక్షల మంది కార్మికుల నమోదుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. 16-59 ఏళ్ల మధ్య కార్మికులు ఈ పథకంలో నమోదుకు అర్హులన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, ఇఎస్ఐ, ఇపిఎఫ్ సభ్యత్వం లేనివారు, ఆదాయపు పన్ను పరిధిలోకి రానివారు అర్హులని తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి రుసుం చెల్లించక్కర్లేదని తెలిపారు. సమీప కామన్ సర్వీస్ సెంటర్లు, పోస్టాఫీసులు, గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. వెబ్ సైట్‌లో https://register. eshram.gov.in సొంతంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ పథకంలో నమోదుకు ఆధార్ కార్డు నకలు, బ్యాంకు ఎకౌంట్ నంబరు, ఆధార్ కార్డ్‌కు లింక్ అయిన సెల్‌ఫోన్ నంబరు అందజేయాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల పనివారు, చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవనాల పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, ఉమ్మడి వ్యవసాయదారులు తదితరులు నమోదుకు అర్హులన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పకడ్బందీగా కృషి చేయాలి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. జనవరి 10 నుండి మార్చి 31 వరకూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాన్ ఇండియా క్యాంపెయిన్ 2.0 నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. 12 శాఖల ఆధ్వర్యంలో కమిటీని నియమించడం జరిగిందని, ప్రణాళికాబద్ధంగా అన్ని ప్రదేశాల్లో దాడులను ముమ్మరం చేసి, పట్టుబడితే నిబంధనల మేరకు ఫైన్, శిక్షలను తప్పక అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ అధికారి ఆకన లక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, గృహ నిర్మాణ శాఖ పీడీ వై.హరి హరినాథ్, ఐసిడిఎస్ అధికారి బి.సుజాతరాణి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.భానూనాయక్ పాల్గొన్నారు.

నేను లోకల్..!

ఉన్నతాధికారి పట్ల క్షేత్రస్థాయి ఉద్యోగి అనుచిత ప్రవర్తన



భీమవరం మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

'నేను లోకల్.. నాకే పని చెబుతారా.. నాకు లోకల్‌గానే కాదు.. సిఎంఒ ఆఫీస్ వరకూ పరిచయాలు ఉన్నాయి.. నా విషయంలో జోక్యం చేసుకోవద్దు' అంటూ ఉన్నతాధికారిణిపై మున్సిపల్ క్షేత్రస్థాయి ఉద్యోగి అనుచితంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో ఆ మహిళా అధికారి చదువు పేరుతో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోతున్నట్లు సమాచారం. ఈ విషయం భీమవరం మున్సిపాల్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భీమవరం మున్సిపాల్టీని సుందరంగా రూపుదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జెసి పర్యవేక్షణలో కమిషనర్ కె.రామచంద్రారెడ్డి నిత్యం శ్రమిస్తున్నారు. అయితే కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి తిష్ట వేసి ఇతర ఉద్యోగులపై అజమాయిషీ చెలాయిస్తున్నారని సమాచారం.

ప్రజారోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగి 'నేను లోకల్ వాడిని.. నాకు పొలిటికల్ లీడర్లతో మంచి పరిచయాలు ఉన్నాయి. అన్నీ నాకు తెలుసు.. నన్ను కాదని ఇక్కడ ఏం చేయలేవు.. నా విషయంలో జోక్యం చేసుకోవద్దు' అంటూ ఆ మహిళా అధికారిణి పట్ల చులకనగా మాట్లాడటంతో కొందరు లోకల్ అంటూ తనను పని చేయనివ్వడం లేదని ఆమె ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నట్లు సమాచారం. మేం మాట్లాడతామని ఉన్నతాధికారులు ధైర్యం చెప్పినప్పటికీ, ఆమె ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని నిర్ణయం తీసుకున్నారు. చదువు పేరుతో ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరినట్లు సమాచారం. సుమారు 15 ఏళ్ల క్రితం ఈ క్షేత్రస్థాయి ఉద్యోగి ఇక్కడ పని చేసిన సమయంలో అతని వ్యవహార శైలి నచ్చక అప్పటి కమిషనర్ వేరే ప్రాంతానికి పంపించినట్లు తెలుస్తోంది. ఇటువంటి క్షేత్రస్థాయి అధికారి ఉన్నతాధికారుల పట్లే అనుచిత వైఖరి అవలంబిస్తున్నారంటే ఇక ప్రజలకు ఏమేరకు సేవలందిస్తారో వేరేగా చెప్పుకోనవసరం లేదు. ఇప్పటికైనా సదరు క్షేత్రస్థాయి ఉద్యోగి తీరు మారేలా ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం: లేబర్ కోడ్లు రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 32వ వార్షికోత్సవం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. ప్రజా నాట్యమండలి కళాకారులు షేక్ వలీ, దేవల శివ గణేష్ గీతాలాపన చేయగా యూనియన్ సీనియర్ నాయకులు మద్దూరి ఆనంద్ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. 2024వ సంవత్సరం కార్యకలాపాల నివేదికను కార్యదర్శి కాయల ప్రసాద్ ప్రవేశ పెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. ఈ వార్షికోత్సవానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల నాయకులు చిర్ల పుల్లారెడ్డి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకా రాజు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరయ్యారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక చట్టాల్లో తీసుకొచ్చిన మార్పులు కార్మికవర్గ ప్రయోజనాలను కాలరాసి పెట్టుబడిదారులకు దాసోహం అన్న పద్ధతిలో మార్పులు ఉన్నాయని విమర్శించారు. జన్మ హక్కుగా భావించే సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తోందని, యూనియన్ పెట్టుకోకుండా ఏ హక్కూ లేకుండా చేస్తోందని తెలిపారు. 45 కోట్ల మందిలో తొమ్మిది కోట్ల మందికే కొన్ని అయినా చట్టాలు ఉన్నాయని, 36 కోట్ల మందికి అసలు ఎటువంటి చట్టాలు కూడా లేవని ఆయన స్పష్టం చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా, మనుధర్మ రాజ్యాంగానికి అనుకూలంగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరణ చేస్తోందని తెలిపారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని లేనిపక్షంలో దేశంలోని అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలను కలుపుకొని దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జవ్వాది శ్రీను, ఉపాధ్యక్షులుగా తట్టాగొట్టి పెద్దిరాజు, కార్యదర్శిగా కాయల ప్రసాద్, సహాయ కార్యదర్శిగా సారిక శ్రీను, కోశాధికారిగా పుట్టా ఏసు, కమాండర్‌గా మద్దూరి ఆనంద్, కమిటీ సభ్యులుగా సువ్వాడ రాంపండు, సుంకర శ్రీను, బాసంశెట్టి శ్రీను, రెండో కమాండర్‌గా సువ్వాడ చిన్న సన్యాసిరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, చిటికిన రాము, నరమాల కృష్ణ, గొర్రెల సతీష్ కుమార్, నగిరెడ్డి బాబ్జీ, ఏపూరి శ్రీను, పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మా స్కూల్ మాకే కావాలి

రాపాకవారి పాలెంలో విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా



రాపాకవారిపాలెంలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని వల్లూరు పంచాయతీ పరిధి రాపాకవారి పాలెంలోని మండల ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను వల్లూరు స్కూల్‌కు తరలిస్తున్నామంటూ అధికారులు చెప్పడంతో గ్రామస్తులు బుధవారం ఆ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మా స్కూల్ మాకే కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో ఎన్నో దశాబ్దాలుగా మా పిల్లలు చదువుకుంటున్నారని, మా స్కూల్ మాకు కావాలని పెద్ద ఎత్తున స్కూల్ విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఇక్కడి నుండి వేరే గ్రామానికి వెళ్లి చదువుకోవాలంటే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందని, ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకూ క్లాసులు ఇక్కడే నిర్వహించాలని, లేకుంటే నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ ప్రాథమిక పాఠశాలలో స్కూలు విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని, అది వంక పెట్టుకుని ఈ స్కూల్‌ను తరలించే ప్రయత్నం జరుగుతుందని, వచ్చే సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగితే అప్పుడు మళ్లీ స్కూల్ ఇక్కడ పెడతారా అని తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో స్కూల్‌ను వేరే గ్రామానికి తరలిస్తే ఊరుకునేది లేదంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

కోడ్ అమలు ఇదేనా..!

ఫ్లెక్సీలు తొలగించరు.. ముసుగులు వేయరు

పట్టించుకోని అధికారులు




కరుగోరుమిల్లిలో కూటమి ఎంఎల్ఎ, ఎంపిపి, జెడ్‌పిటిసి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - ఆచంట

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికారులు నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఎంఎల్ఎ, జెడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచి కూటమి నేతల ఫ్లెక్సీలు కలకలం సృష్టిస్తున్నాయి. వీటిని తొలగించేందుకు మండల అధికారులు వెనుకంజు వేస్తున్నారు. దీంతో ఆచంట మండల అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శల్లో వెల్లువెత్తుతున్నాయి. గత జనవరి 29వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే మండలంలో కరుగోరుమిల్లి, కొడమంచిలి, వల్లూరు, తదితర గ్రామాల్లో అధికార పార్టీ ఎంఎల్ఎతో కూడిన ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించలేదు. వాటికి ముసుగు కూడా వేయని పరిస్థితి. అసలు ఎన్నికల కోడ్ అమల్లో ఉందా అనే అనుమానాలు అందరిలో నెలకొన్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వివిధ రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం, రాజకీయ నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించడం చేయాలి. అయితే కోడ్ అమల్లోకి వచ్చి సుమారు 14 రోజులు దాటినా ఇప్పటివరకూ ఆ ప్రక్రియను అధికారులు పూర్తి చేయలేదు. దీంతో ఎన్నికల కోడ్ అమల్లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల కోడ్ అమలు చేసే విధంగా అధికారులు స్పందించి రహదారి పక్కన ఉన్న రాజకీయ పార్టీ నాయకుల ఫొటోలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రాఘవులు గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రతాప్

ప్రజాశక్తి - ఇరగవరం

పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు గెలుపునకు ప్రజా సంఘాలు కృషి చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం ఇరగవరంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం, పలు అంశాలపై సమావేశం కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం అలుపులేకుండా గత 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న వీర రాఘవులును గెలిపించడం అందరి బాధ్యత అన్నారు. నేడు ఓట్లు అంటే నోట్లుగా మారిన రోజుల్లో ప్రజలు, నిరుద్యోగుల సమస్యలు గానీ పట్టించుకోని పార్టీలు నేడు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని అన్నారు. కోట్లకు పడగెత్తిన వారే ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి ముందుకొస్తున్న సమయంలో పేదలు, మధ్యతరగతి తరపున పనిచేసేందుకు ముందుకొచ్చిన వ్యక్తి వీరరాఘవులు అని తెలిపారు. అందరం సహకరించి ఆయనను గెలిపించేందుకు కృషి చేయాలని ప్రతాప్ అన్నారు. మండలంలో సుమారు 1900 ఓట్లు ఉన్నాయని, మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజాసంఘాల బాధ్యులు చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామాంజనేయులు, పెచ్చేటి సుబ్బారావు పాల్గొన్నారు.

బధిరుల రాష్ట్రస్థాయి టి-20 క్రికెట్ పోటీలు ప్రారంభం



బధిరుల క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బధిరులు కూడా సమాజంలోని అందరితో సమానమని, వారికి సముచిత స్థానం ఉందని, నిరాశ చెందినవసరం లేదని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం డిఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి బధిరుల (మూగ, చెముడు) టీ 20 క్రికెట్ పోటీలను ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. బధిరులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, క్రీడల్లో రాణిస్తే ఎన్నో ఉద్యోగావకాశాలున్నాయని, మానసిక ఆందోళన చెందకూడదని తెలిపారు. ఇటువంటి పోటీలను భీమవరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సిహెచ్ తాతారావు మాట్లాడుతూ తొమ్మిది జిల్లాల నుంచి 50 మంది బధిర క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, జోన్-1, 2, 3 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు) విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని, గురువారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు కూనపరాజు రామకృష్ణంరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, కంతేటి వెంకటరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు

డాక్టర్ ప్రియాంక వర్మ

భీమవరం టౌన్ : చర్మ సంబంధిత సమస్యలను ముందస్తుగా గుర్తిస్తే నయం చేసుకొని ఇతరులకు వ్యాప్తి చెందకుండా చూడవచ్చని డాక్టర్ ప్రియాంక వర్మ అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని ప్రియాంక చర్మ వ్యాధుల ఆసుపత్రిలో ఉచిత చర్మ వ్యాధుల మెడికల్ క్యాంప్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడుతూ చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదని, చర్మ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. చర్మంపై ఎక్కడైనా, ఏదైనా తేడా కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దేశంలో వందమందిలో 30 మంది చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. అనంతరం 120 మందికి ఉచితంగా చర్మ సంబంధిత పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిటిడిసి బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మోషన్ రాజుకు ధన్యవాదాలు తెలియజేస్తున్న వైసిపి మహిళ జిల్లా అధ్యక్షురాలు

మోషేన్ రాజును కలిసిన వైసిపి నాయకులు

భీమవరం టౌన్ : వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన కోడె విజయలక్ష్మి యుగంధర్ బుధవారం స్థానిక శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా బుధవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేను రాజును సాల్వతో సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోషన్ రాజు విజయలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి యుగంధర్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తాను స్థానిక నాయకులను కలుపుకుంటూ తన భర్త యుగంధర్ సూచనలతో ఒక కార్యకర్తల పని చేస్తానని తెలిపారు. అలాగే పార్టీ అధిష్టానం ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. విజయలక్ష్మిని పలువురు పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తమ అభినందించారు. వైసిపి నరసాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, డాక్టర్ వి.రామకృష్ణంరాజు, మేడిది జాన్సన్, కామన నాగేశ్వరరావు, ఎఎస్‌ఎన్.రాజు, చిన్నమిల్లి రాయుడు మర్యాదపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, ఇంటి సత్యనారాయణ, డివిడి ప్రసాద్, తుంపల శ్రీను, చిగురుపాటి సందీప్ పాల్గొన్నారు.

కరాటేలో మాంటిస్సోరీస్ విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు : కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన కరాటే చాంపియన్‌షిప్‌లో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్‌కి చెందిన 24 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో కరాటేలో ఉత్తమంగా రాణించారని స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కరాటే శిక్షణలో 17 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో బెల్ట్‌లు సాధించారన్నారు. ప్రతి సంవత్సరం కూడా విద్యార్థులు వివిధ విభాగాలలో బెల్టులు సాధిస్తున్నారని చెప్పారు. ఈ కరాటే ఆడపిల్లలకు వారిని వారు సంరక్షించుకోవడానికి ప్రస్తుత సమాజంలో చాలా ఉపయోగపడుతుందన్నారు. అంతేకాదు కరాటే నేర్చుకుంటున్న వారికి ఏసియన్ గేమ్స్‌లో అవకాశం ఉండటంతో పాటు వీరు సాధించిన ఈ సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో ఉపయోగపడతాయని తెలిపారు. ఉల్లంపర్రు మాంటిస్సోరిస్‌లో చదువుతున్న ప్రతి విద్యార్థినికు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. ఇందులో ప్రతిభను సాధించిన విద్యార్థులకు, కరాటే ట్రైనర్ శివ కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అంగన్వాడీలకు మూడు రోజుల శిక్షణ

పెనుమంట్ర : పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఈనెల 13, 14, 15 తేదీల్లో అంగన్వాడీ కార్యకర్తలు అందరికీ మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెనుమంట్ర జడ్‌పి హైస్కూల్‌లో 3 రోజుల పాటు పోషణ్ భీ పఢాయి భీ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

రైల్వేపాసులకు ఆన్‌లైన్ సౌకర్యంపై హర్షం

భీమవరం టౌన్ : వికలాంగ పాసులకు రైల్వే శాఖ ఆన్‌లైన్ సౌకర్యం కల్పించడం పట్ల శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం ప్రకటించారు. బుధవారం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో జరిగిన సమావేశంలో సభ్యులు హర్షం ప్రకటిస్తూ మాట్లాడారు. సంఘ అధ్యక్షులు కందుల సురేష్, సభ్యులు మాదాల శ్రీనివాస్, జి.దుర్గాప్రసాద్, కె.వాసు, పి.బలరామయ్య, బి.నాగమణి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 58 వేల మంది వికలాంగులు ఉన్నారని, వికలాంగుల రైల్వే పాసులను నేరుగా స్టేషన్లో కాకుండా ఆన్‌లైన్‌లో రైల్వే శాఖ వెబ్‌సైట్ ద్వారా పొందేలా ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వికలాంగులు రైల్వే పాసు తీసుకోవాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని, ప్రస్తుతం పాసులు పొందటానికి ఆన్‌లైన్ ప్రక్రియ రూపొందించడం సంతోషకరమైన విషయమని అన్నారు. భీమవరం రైల్వే ఎస్ఆర్ఎం విఎస్‌కె.చక్రవర్తి, టిటిఐ ఎ.వివేకర్ బాబు, ఎస్.మధు మాట్లాడుతూ రైల్వే శాఖ వికలాంగులకు ఎన్నో సదుపాయాలను అందిస్తుందని తెలిపారు.

20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కృషి

ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి

తణుకు రూరల్ : రాబోయే ఐదేళ్లలో నిరుద్యోగులకు రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోరుతూ బుధవారం అత్తిలి మండలంలో పర్యటించి మాట్లాడారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఎంఎల్‌సి పరిశీలకులు కొవ్వూరి లక్ష్మీనారాయణ ఓటర్లను కోరారు. బుధవారం మండలంలోని పొలమూరు, పెనుమంట్ర గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆచంట నియోజకవర్గ టిడిపి పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, ఎంఎల్‌సి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కొంతల లక్ష్మీనారాయణ ఉన్నారు.

నారాయణ విద్యార్థులకు అభినందన : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : జెఇఇ మెయిన్స్-2025 పరీక్ష ఫలితాల్లో భీమవరం నారాయణ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం ఉభయగోదావరి జిల్లాలకే గర్వకారణమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం నారాయణ కళాశాల విద్యార్థులు ఎ.ప్రశాంత్ కుమార్ 99.3, ఎల్.అభినవ్ 99.3 పర్సంటైల్ సాధించారని సంస్థ డీన్ దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ప్రతిభ చాటిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపకులను ఆయన అభినందించారు. కళాశాల కోర్ డీన్ చంద్రశేఖర్, డిజిఎం రమేష్, ఎజిఎం రాజు, ప్రిన్సిపల్ ఎ.రమేష్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొవ్వలి ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యం

నరసాపురం: కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నరసాపురం పట్టణంలోని 25వ వార్డు, వివర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 16వ తేదీన ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. తల, మెడ, మడమ, మోకాళ్ళ తదితర దీర్ఘకాలిక నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు, కొవ్వలి ఫౌండేషన్ నిర్వాహకులు కొండా శ్రీధర్ ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యం ద్వారా ఉపశమనం కల్పిస్తున్నారు. నరసాపురం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి రామ్మోహన్ నాయుడు కోరారు. మరిన్ని వివరాలకు తమ ఫోన్ నెంబర్ 9985678881ను సంప్రదించాలని సూచించారు.


రామ్మోహన్ నాయుడు


పౌల్ట్రీ ఫారంలో శానిటేషన్ పనులు నిర్వహించిన సిబ్బంది

వ్యాధి వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు

పంచాయతీ కార్యదర్శి రత్నమాలిక

తణుకు రూరల్ : మండలంలోని వేల్పూరు గ్రామంలో కృపానందం పౌల్ట్రీ ఫారంలో బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ కావడంతో ఒక కిలో మీటర్ పరిధి వరకు బ్లీచింగ్ చల్లి శానిటేషన్ పనులు నిర్వహించినట్లు వేల్పూరు పంచాయతీ కార్యదర్శి ఎస్.రత్నమాలిక తెలిపారు. అదేవిధంగా రెడ్ జోన్ పరిధిలో ఉన్న వేల్పూరు గ్రామంలో కోడిమాంసం, కోడిగుడ్లు, కర్రీ పాయింట్ వ్యాపారులకు వీటిని విక్రయించరాదని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామంలో మైక్ ద్వారా మాంసం వినియోగించరాదని ప్రచారం నిర్వహించారు. ఇతర కోళ్లకు ఈ వైరస్ వ్యాపించకుండా శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీ చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత

ఆచంట : మానవత మండల శాఖ ఆధ్వర్యంలో ఆచంట గ్రామంలోని కౌరుపాలెం, కోనపోతుగుంట, ముత్యాలమ్మ చెరువు, కసరత్తుగుంట, ఎరుకల వీధి గ్రామాల్లో ఉన్న 5 అంగన్వాడీ కేంద్రాల్లోని 80 మంది చిన్నారులకు ప్లేట్‌లు, గ్లాసులు, కప్పులు స్థానిక దాతలు సజ్జా నారాయణ, ప్రశాంతి దంపతుల సహకారంతో బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కేతా రామకృష్ణ, కొల్లేపర వెంకన్న బాబు, నంబూరి అంజిబాబు, వేంద్ర శ్రీనివాస్, మయూరి శర్మ, బొక్కా రామకృష్ణ, గుండాబత్తుల ఆనంద్‌కుమార్, తమ్మినీడి సత్యానారాయణమూర్తి, గుబ్బల జోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థల పట్టాల పున: పరిశీలన ప్రారంభం

ఆకివీడు : మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను అధికారులు పున: పరిశీలన ప్రారంభించారు. బుధవారం తాళ్లకోడులో మంజూరు చేసిన 3,200 పట్టాల పరిశీలన కార్యక్రమం మొదలుపెట్టారు. ఈ క్రమంలో భాగంగా మొదటి రోజున 70 పట్టాలను పరిశీలించినట్లు తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈరోజు పరిశీలించినవి అన్ని సక్రమంగానే ఉన్నాయని అన్నారు. తమకు మొదటి రోజున పరిశీలనలో రెండు ఫిర్యాదులు అందాయని, వాటిని త్వరలో పరిశీలిస్తామన్నారు.

ఉపాధ్యాయులు అపోహ చెందొద్దు : ఎంఇఒ

ఆచంట : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం జరుగుతున్న పాఠశాల పునర్వవస్థీకరణ ఆ పాఠశాల తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ తీర్మానం అనుసరించి జరుగుతున్నట్లు ఎంఇఒ ఎ.ఉషారాణి తెలిపారు. ఉపాధ్యాయులు ఈ విషయాలపై ఎటువంటి అపోహలకు గురి కావద్దని ఆమె అన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన

గణపవరం : విద్యార్థులు రసాయన శాస్త్ర ప్రాముఖ్యత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై బుధవారం స్థానిక డిగ్రీ కాలేజీ కెమిస్ట్రీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథి ఉపన్యాసులుగా పాల్గొన్న తాడేపల్లిగూడెం డిఆర్‌జి ప్రభుత్వ డిగ్రీ కాలేజి రసాయన శాస్త్ర అధ్యాపకులు ఎం.వి.ప్రేమ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. లెక్చరర్లు సిహెచ్.చైతన్య, ఎన్‌విఎన్‌బి.శ్రీనివాస్ రావు, షేక్ మెయిన్ అన్సారీ పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

ఆచంట : రైతులందరూ త్వరితగతిన ఫార్మర్స్ రిజిస్టర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయ అధికారులు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా రైతులు ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కి లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలను తీసుకొని రైతు సేవా కేంద్రం వద్ద నమోదు చేసుకోవాలని అన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చు అన్నారు. పంటల బీమా, పిఎం కిసాన్ యోజన, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు రైతులకు వర్తిస్తాయని తెలిపారు.

ఉండి : రైతులందరూ సంక్షేమ పథకాలు రాయితీలు పొందాలంటే విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి అని ఉండి మండల వ్యవసాయాధికారి బి.సంధ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరికీ ఆధార్ తరహాలో కేంద్ర ప్రభుత్వం 14 అంకెల విశిష్ట సంఖ్యను తీసుకువచ్చిందని, దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు, రాయితీలు, పెట్టుబడి, పంటల బీమా, పంటల కనీస మద్దతు ధర, పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాల సేవలు పొందేందుకు దోహదం అవుతుందన్నారు. ప్రస్తుతం సొంత పొలాలు ఉన్న రైతులకు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, తర్వాత కాలంలో కౌలు రైతులకు కూడా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రతి రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్‌కు లింకైన ఫోన్‌ను దగ్గర్లోని రైతు సేవా కేంద్రానికి తీసుకుని వెళ్లి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు కోరారు.

విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

పెనుమంట్ర : పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్(ఈగల్)ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని స్థానిక ఎంఇఒ యు.నాగేశ్వరరావు బుధవారం ఇక్కడ తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు, విద్యాసంస్థల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఒక్కో క్లబ్‌లో టీచర్లు, లెక్చరర్లు, విద్యార్థులు కలిపి మొత్తం 10 మంది సభ్యులుగా ఉంటారని, క్లబ్ పదవీకాలం ఏడాది పాటు ఉంటుందని, ఇవి విద్యా సంస్థల్లో మత్తుపదార్థాల వినియోగం లేకుండా చూడడం, వాటి వల్ల కలిగే ఇబ్బందులపై సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేస్తాయని అన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమం నిర్వహించారు. నులిపురుగు నివారణపై బుధవారం విద్యార్థులకు అవగాహన, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ కెవి.సీతారామరాజు చేతులమీదుగా విద్యార్థులకు నులిపురుగు నిర్మూలనకు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం, పోషకాహారం, విద్యకు ప్రాధాన్యత, జీవన నాణ్యతను మెరుగుపరచుటకు భారత ప్రభుత్వం 2017 నుంచి ఈ కార్యక్రమాన్ని ఒక బృహత్ కార్యక్రమంగా పాఠశాల, కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తద్వారా కౌమార దశలో విద్యార్థులు ఆరోగ్యంగా పెరుగుటకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రాధ, మాధవి, రాంబాబు, అధ్యాపకులు వర్మ, శేఖర్ బాబు, జానకి రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల రక్తదానం

భీమవరం టౌన్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా భీమవరం ఆర్‌టిసి బస్టాండ్ నందు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సొసైటీ వారి నిర్వహణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ పిఎన్‌విఎం.సత్యనారయణ మూర్తి తెలియజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల నుంచి ఉద్యోగులు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిపిటిఒ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు డిపోల నుంచి వచ్చి రక్తదానం చేసిన ఉద్యోగులను ప్రాణదాతలుగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డిపిటిఒ ఆఫీస్ ఉద్యోగులు, గ్యారేజి, ట్రాఫిక్ సూపర్‌వైజర్స్, అకౌంట్స్, పర్సనల్ ఆఫీస్ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు హోటళ్లలో తహశీల్దార్ల తనిఖీ

డొమెస్టిక్ సిలిండర్ల పట్టివేత

ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రం ఆకివీడు దగ్గర పంచాయతీ పరిధిలోని హోటళ్లపై బుధవారం రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. మండల కేంద్రంలో ఉన్న అన్ని హోటళ్లలోను తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో బుధవారం సాయంకాలం ఈ ఆకస్మిక దాడులు జరిపారు. క్యాంటీన్లు, మూడు హోటళ్లలో ఈ దాడులు నిర్వహించి 5 డొమెస్టిక్ సిలిండర్లు పట్టుకున్నట్టు తెలిపారు. కమర్షియల్ సిలీండర్లు వాడవలసిన వ్యాపార సంస్థల్లో గృహ అవసరాలకు వాడే గ్యాస్‌ను వినియోగించడంతో ప్రభుత్వ సబ్సిడీ దుర్వినియోగం అవుతుందని ఆయన వివరించారు. ఈ రకమైన విధానం నేరమని అకారణంగా ఆ ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకొని, వారిపై కేసులు నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు. సిలిండర్లను స్థానిక గ్యాస్ డీలర్ ఎంఆర్‌సి ఏజెన్సీలో అప్పగించినట్లు తెలిపారు.


ఆకివీడులో..

నరసాపురం: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు రెస్టారెంట్‌లలో బుధవారం నరసాపురం తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రెస్టారెంట్లలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్న లక్ష్మీ అన్నపూర్ణ రెస్టారెంట్, స్వాధిష్ట రెస్టారెంట్లపై కేసులు నమోదు చేశారు. హోటల్‌లో ఆరు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని, తగు చర్యలు నిమిత్తం గ్యాస్ కంపెనీలకు అందించినట్లు తహశీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. ఈ తనిఖీలో సివిల్ సప్లై డీటీ అయితం సత్యనారాయణ, ఆర్ఐ మిరియాలు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండల కేంద్రంలో పలుచోట్ల తహశీల్దార్ కిషోర్ బుధవారం తనిఖీలు చేశారు. లక్ష్మీ హరిప్రియ రైస్ మిల్లు, లక్ష్మీ హరిప్రియ హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ, చౌక డిపోలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ సంధ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెత్తను వేరు చేసి ఇవ్వాలి

ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలు తాము పారవేసే చెత్తను తడి, పొడి కింద వేరు చేసి అందించే విధంగా అలవాటు చేయాలని పంచాయతీల మండల విస్తరణ అధికారి ఎం.వెంకటేష్ సూచించారు. మండలంలోని వీరంపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల వద్ద వర్మీ తయారు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని, ఆ వర్మి తయారు చేయడం వల్ల ఇటు పెంట కుప్పలు తగ్గడంతో పాటు ఆదాయం కూడా సృష్టించవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధంగా అవగాహన కల్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడేపల్లి బేబీ, కార్యదర్శులు వి.వాణి, రఘు, నాయకులు చంద్రారెడ్డి, తాడేపల్లి శ్రీనివాస్, ఎంఆర్‌సిఎం రవి కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

జెఇఇ మెయిన్స్‌లో తిరుమల విద్యార్థుల విజయభేరి


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్


కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనవరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జెఇఇ మెయిన్స్ 2025 పరీక్ష ఫలితాలలో భీమవరంలోని తమ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను కనబరిచారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాలలో తమ భీమవరం తిరుమల విద్యార్థి పిజె.హర్షవర్ధన్ 99.76 శాతం మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, సుమారు 95 మంది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటి అండ్ ఐఐఐటీలలో సీట్లు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ విద్యార్థులు పిజె.హర్షవర్ధన్ 99.76, ఎ.శివ కార్తీక్ 99.74, జి.నిఖిల్ వర్మ 99.64, కె.శివ 99.54, విఎల్‌ఎస్‌కె.కార్తీక్ 99.31, జిజిఎన్ఎమ్ వెంకట్ 99.18, ఎమ్.సాయి చరణ్ 99.03 పర్సంటేజ్ సాధించారని తెలియజేశారు. అలాగే 99.5 కుపైగా 4 గురు, 99 పర్సంటేజ్ పైగా 7 గురు, 98 పైగా 17 మంది, 95 పైగా 43 మంది, 93 పైగా 64 మంది, 90 పైగా 105 మంది సాధించారని డైరక్టర్స్ ఎన్.సాయిరాజు, పి.శ్రీనివాస వర్మ, జి.సతీష్ బాబు తెలియజేస్తూ సుమారు 95 మంది విద్యార్థులు ఎన్ఐటి అండ్ ఐఐఐటీ సీట్లు సాధించగలరని తెలియజేశారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ, సహకరించిన తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.

రైతు రిజిస్ట్రీ సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వీరవాసరం

రైతులకు సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రిజిస్ట్రీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మత్స్యపురి గ్రామంలో రైతు సేవా కేంద్రంను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జెసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. జవ్వాది విష్ణుమూర్తి, జవ్వాది నాగవేణి అను ఇద్దరు రైతులకు జెసి చేతులమీదుగా స్వయంగా రిజిస్ట్రేషన్ చేసి గుర్తింపు నెంబరును అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూమి కలిగిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసి ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఆధార్ నెంబర్ లింక్ అయిన మొబైల్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్తే ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసి ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. దీని ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే పంటల బీమా, పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలపై రాయితీ, పంట నష్టపరిహారం, తదితర పథకాలను రైతులు సులువుగా పొందవచ్చు అన్నారు. అనంతరం ఇ-పంట నమోదు చేసిన వాటిలో కొన్ని సర్వే నెంబర్లను క్షేత్రస్థాయిలో ఆయన స్వయంగా పరిశీలించారు.


రైతు రిజిస్ట్రీని పరిశీలిస్తున్న జెసి

గ్రామంలో త్వరితగతిన రీ సర్వే పూర్తి చేయాలి

మత్స్యపురి గ్రామంలో రీ సర్వే సమస్యలు ఎక్కువగా ఉండటం గుర్తించడం జరిగిందన్నారు. త్వరితగతిన రీసర్వే పూర్తి చేయాలని అన్నారు. రీ సర్వేలో విధి విధానాలను, సూచనలు, సలహాలను సూచించారు. ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి రెండు వారాలలో గ్రామంలో రీ సర్వే సమస్యలను పరిష్కారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవ సాయ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్, తహ శీల్దార్ రామాంజనేయులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

నరసాపురం : పట్టణంలోని పలు వార్డుల పరిధిలో ప్రధాన డ్రెయినేజీలను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. 3 బిన్ సిస్టంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త వేరువేరుగా సేకరించు అంశంపై పలు వార్డులలోని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ రోడ్డుపైన, డ్రెయిన్‌లో చెత్త వేయకుండా డస్ట్‌బిన్స్‌లో తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను విడివిడిగా అందివ్వాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది అందరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ప్రతి ఇంటి నందు తప్పనిసరిగా 3 బిన్ సిస్టం తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త వేరువేరుగా సేకరించాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం : నరసాపురం సబ్ డివిజన్ పరిధిలోని 132/33కేవీ నరసాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 14వ తేదీ సబ్ స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. సబ్ డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇఇ కోరారు.

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు

ఏలూరు : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో బుధవారం ఎవరూ తమ నామినేషన్లు ఉపసంహరించుకోలేదు. నామినేషన్ల పరిశీలన అనంతరం 43 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్న సంగతి తెలిసిందే. గురువారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక బరిలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

చికెన్ అమ్మకాలు నిషేధం

ఆచంట : జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో చికెన్ అమ్మకాలను నిషేధిస్తున్నట్లు తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. మండలంలో ఎక్కడైనా చికెన్ అమ్మకాలు చేపడితే ఆయా యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ బుధవారం హెచ్చరికలు జారీ చేశారు. మండలంలో కనీసం 21 రోజులపాటు కోడి మాంసం అమ్మకాలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఆకివీడు : స్థానికంగా కోడి మాంసం విక్రయిస్తున్న షాపుల్లో ఇకనుంచి కోడి మాంసం విక్రయించొద్దంటూ అధికారులు ఆదేశించారు. బుధవారం సాయంకాలం రెవెన్యూ అధికారులు ఆర్ఐ ఆంజనేయులు, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది మాంసం దుకాణాల వద్ద పరిశీలన చేశారు. ముందుగా కోడి మాంసం తొలగించాలని తీయించి వేశారు. ఈరోజు నుంచి కోడిమాంసం విక్రయించ వద్దంటూ హెచ్చరించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : పీడీ

నరసాపురం : డివిజన్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ హరి హరనాథ్ అన్నారు. బుధవారం గృహ నిర్మాణ సంస్థ డివిజన్ కార్యాలయంలో నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలోని గృహనిర్మాణ సంస్థ డిఇఇ, ఎఇలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ ఇళ్ల పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. గతంలో మేస్త్రీలు ద్వారా నిర్మాణాలు చేసిన గృహాల పరిస్థితిపై ఆరా తీశారు. గృహాలకు సంబంధించిన లబ్ధిదారులను కలిసి మాట్లాడి నిర్మాణాలను పూర్తి చేసే విధంగా వారికి అవగాహన కల్పించి, సమాయత్తం చేయాలన్నారు. సమావేశంలో నరసాపురం, పాలకొల్లు సబ్ డివిజన్ల డిఇఇలు రామాయణం త్రిమూర్తులు, పి.వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ సంస్థ ఇఇ ఎం.శ్రీనివాస్, ఎఇ రవీంద్ర పాల్గొన్నారు.

క్యాంప్ బెల్ సత్రం దుకాణాల వేలం పాట వాయిదా

ఉండి : ఉండి మెయిన్ సెంటర్లో ఉన్న క్యాంప్ బెల్ దేవాదాయ సత్రం దుకాణాల బహిరంగ వేలం వాయిదా పడినట్లు దేవాదాయ శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యనిర్వాహణాధికారి సాగిరాజు రంగరాజు ఆధ్వర్యంలో ఉండి మెయిన్ సెంటర్లో క్యాంపు బెల్ సత్రంపైన ఏర్పాటుచేసిన దుకాణాలకు మూడు సంవత్సరాల కాల పరిమితిలో అద్దెలకు ఇవ్వడానికి బహిరంగ వేలం వేసేందుకు సిద్ధమవ్వగా దుకాణాల వేలంలో పాల్గొనేందుకు ఎవరూ రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా దుకాణాల బహిరంగ వేలం పాటకు ఎవరు రాకపోవడానికి ప్రధాన కారణం బహిరంగ వేలం ప్రకటన ప్రచారం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడమేనని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మరోపక్క క్యాంపు బెల్ సత్రంపై దుకాణాలకు వెళ్లడానికి బస్టాండ్ వైపు చిన్న మార్గం మాత్రమే ఉండగా వ్యాపారం ఏవిధంగా సాగుతుందని కొందరు వ్యాపారస్తులు విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా క్యాంపు బెల్ సత్రంపై దుకాణాలకు మెయిన్ రోడ్డు దగ్గర నుంచి మెట్ల మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధ్యాయుడుపై విచారణ

పెనుగొండ : ఉపాధ్యాయుడుపై 8వ తరగతి బాలికలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సంఘటన మండలంలోని దేవ గ్రామంలో చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పంది మాధవ దాస్ అనే వ్యక్తి 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు వాపోయారు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సమగ్ర విచారణ జరిపిస్తామని అన్నారు. పై అధికారులు నరసాపురం డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి మురళీ సత్యనారాయణ విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని, హై స్కూల్లో ఉపాధ్యాయుడుపై విచారణ చేపట్టగా విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాడని, అసభ్యకరంగా మాట్లాడతాడని తేలిందని, ఉపాధ్యాయుడుపై పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సిఐ విజయ్‌కుమార్, సిడిపి.కృష్ణకుమారి, రూతు కుమారి, ఇతర అధికారులు ఉన్నారు.